క్లుప్తంగా

108 అంబులెన్స్‌లో తనిఖీ



కాజీపేట: హనుమకొండ కలెక్టరేట్ సముదాయం ఆవరణలో ఉన్న 108 అంబులెన్స్‌ను సంబంధిత అధికారులు ఆదివారం తనిఖీ చేశారు. అనిశెట్టి రమేష్ వాహనాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో బొక్క చైతన్య, పైలట్ లకావత్ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌నగర్ కార్యవర్గం ఎన్నిక



కాజీపేట రూరల్: కాజీపేట 48వ డివిజన్ భీమ్ నగర్ కాలనీ అభివృద్ధి నూతన కార్యవర్గాన్ని కాలనీవాసులు ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బాతుక వీరన్న, ఉపాధ్యక్షుడిగా ఏల్పుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దర్శనాల మొగిలయ్య, కోశాధికారిగా గోనెల రమేష్, సహాయ కార్యదర్శులుగా పోతరబోయిన రవి, బసుక యాదగిరి, కార్యనిర్వాహణ సభ్యులు, సలహాదారులు, ఆడిటర్లను ఎన్నుకున్నారు.

ఫాతిమానగర్‌లో మహా అన్నదానం



కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్ కెథిడ్రల్ చర్చి ప్రాంగణంలో సెయింట్ విన్సెంట్ డి పాల్ సొసైటీ, విచారణ గురువు కాసు మర్రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యుడు ప్రతాప్ మాట్లాడుతూ సెయింట్ విన్సెంట్ డి పాల్ 1993వ సంవత్సరంలో స్థాపించినట్లు వివరించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది క్రీస్తు జయంతి పండుగ సందర్భంగా పేదలకు మహా అన్నదానం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విన్సెంట్ డి పాల్ సొసైటీ సభ్యులు, క్రైస్తవ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడిపూజ



వరంగల్: నగరంలోని 14వ డివిజన్ ఎస్‌ఆర్‌నగర్‌లో కేతిరి లావణ్య – రాజశేఖర్ గురుస్వామి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. రాచర్ల రాజు పర్యవేక్షణలో స్వాములు భక్తితో పూజలు, భజనలు చేశారు. కార్యక్రమంలో కేతిరి సమ్మక్క, సంతోష్, పసులాది మల్లయ్య, మచ్చర్ల స్టాలిన్, ముదుసు నరసింహ, పున్నం ప్రభాకర్, అంబాల సత్యం, సుభాష్, కొంగర సుదర్శన్, ఏపీ శీను, చీకటి రవి, వంగ చందు, హైమావతి, రాపర్తి సతీష్, పిట్టల సంజీవ, పద్మ, రాధిక, రాజేశ్వరి, రజిత, వినాకర్ మధు, వినమాల, మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

మంత్రి సురేఖకు శుభాకాంక్షలు



హన్మకొండ కల్చరల్: రాష్ట్ర అటవీ శాఖ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సురేఖను ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ 39వ డివిజన్ యువజన కార్యకర్త వీరమల్ల రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

ఇనుపరాతి గుట్టలను రక్షించుకోవాలి

ధర్మసాగర్ : ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఊపిరితిత్తులుగా భావించే ఇనుపరాతి గుట్టలను పరిరక్షించుకోవాలని విశ్రాంత అటవీ శాఖ అధికారి పురుషోత్తం అన్నారు. అటవీశాఖ, జనవిజ్ఞాన వేదిక, పర్యావరణ పరిరక్షణ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ధర్మసాగర్ జిల్లా పరిషత్ బాలుర సెకండరీ పాఠశాల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఆదివారం గ్రామ శివారులోని ఇనుపరాతి గట్టులో ట్రెక్కింగ్ నిర్వహించారు. కార్యక్రమాన్ని హెచ్‌ఎం ధర్మప్రకాష్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు సురేష్ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ అడవుల అభివృద్ధి, ఉత్పత్తి శ్రేణుల జీవనానికి ప్రధాన వనరులు ప్రజా జీవనంతో నిత్య సంబంధం కలిగి ఉంటాయని తెలిపారు. వాటిని పరిరక్షించుకోవడం అందరి సమష్టి బాధ్యత అని పేర్కొన్నారు. ఆయా సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే వేడుకలు



వరంగల్: పెన్షనర్లను సన్మానిస్తున్న టీఎన్జీఓ నాయకులు



హన్మకొండ: సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం పాత కూరగాయల మార్కెట్‌లోని యూనియన్ భవనంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగపురి సారయ్య అధ్యక్షతన విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం 'పెన్షనర్స్ డే'ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెన్షనర్స్ డేలో ఉమ్మడి జిల్లాలో ఉన్న మార్కెట్ కమిటీల చెందిన 100మంది సర్వీస్ పెన్షనర్లు, 50 మంది ఫ్యామిలీ పెన్షనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన టీఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాంకిషన్, వేణుగోపాల్ హాజరై మాట్లాడారు. అనంతరం 75ఏళ్ల వయస్సు దాటిన 12 పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యనాథ్, అశోక్, శివకుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం అన్నారు. హనుమకొండలోని అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో పెన్షనర్స్ డే ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. అనంతరం, సీతారాం మాట్లాడుతూ ప్రతినెలా మొదటి తేదీనే పింఛన్ చెల్లించాలని కోరారు. అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో నాణ్యమైన నగదు రహిత వైద్యం అందించాలని, పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను వెంటనే చెల్లించాలని, 2023, జూలై నుంచి పీఆర్సీ అమలు చేయాలని, మధ్యంతర భృతిని పెంచాలని, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. తెలంగాణ మొదటి పీఆర్‌సీ రికమండ్ చేసినట్లు 20ఏళ్ల సర్వీసుకు ఫుల్ పెన్షన్ చెల్లించాలని, పెండింగులో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఇతర బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వై.మాధవరావు, గోపు రాములు, పంచానన దామోదర్, ఎం.రఘుపతి రెడ్డి, జీజుల చంద్రయ్య, ఈట రాజేశ్వర్ రావు, ఏ.ప్రభాకర్ రావు, కే.వీరస్వామి, పెంచల ఆగయ్యను సన్మానించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణగిరి వీరన్న, నాయకులు పెండ్యాల బ్రహ్మయ్య, చిదురాల సత్యనారాయణ, బేతి శంకరలింగం, రహీం, రెబెల్లి వెంకటేశ్వర స్వామి, బండారు ఆంజనేయులు, ఉప్పు సమ్మయ్య, శంకర్ రావు, ఆర్తి సంపత్‌కుమార్, రాజమల్లు, సిరంగి నారాయణ, వనజ, నరసింహారాములు, రౌతు వెంకట్రామ నర్సయ్య, దేవరాజం, తదితరులు పాల్గొన్నారు.



కాజీపేట: నకరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

కాజీపేటలో వేడుకలు

కాజీపేట: కాజీపేట పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జాతీయ పెన్షనర్స్ డే వేడుకలను అసోసియేషన్ అధ్యక్షుడు పీ.కృష్ణమూర్తి ప్రారంభించారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ రావడానికి ఆధ్యుడైన డీఎస్ నకరా చిత్రపటానికి సంఘం కార్యదర్శి జీ.సుధాకర్ రావు, సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మండలోజు కృష్ణమూర్తి, చంద్రమోహన్, నాగేష్, బాబురాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ఖిలా వరంగల్: ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు సూచించారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవనంలో తాళ్లపెల్లి రహేలా అధ్యక్షతన జిల్లా సమితి సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన నిరంకుశ పాలకులను గద్దెదించిన విధంగానే కేంద్రంలోనూ మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని అన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేశారని, పెట్టుబడిదారి, కార్పొరేటర్ శక్తులకు ప్రభుత్వ సంపదను ధారాదత్తం చేశారని ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని కాపాడాలని, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను విరమించుకోవాలని, దేశ రాజధాని ఢిల్లీలో నెలల తరబడి ఆందోళన చేసిన రైతుల ప్రాణాలను బలిగొన్నారని వాపోయారు. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను హరించేలా కార్మిక చట్టాలను యజమాన్యాలకు అనుకూలంగా మార్చివేశారని గుర్తు చేశారు. ఈనెల 26న సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరం, గ్రామాల్లో ఎర్ర జెండాలు ఎగరవేయాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శి మేకల రవి, షేక్ బాషమియా, పంజాల రమేష్, రవీందర్, గన్నారపు రమేష్, చంద్రకళ, శంకరయ్య, ఎలేందర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే సైన్స్ ఫెయిర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శిరీష్ హరి సోనావానే

కాశిబుగ్గ: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ దోహదపడుతుందని ఎన్ఐటీ ప్రొఫెసర్ శిరీష్ హరి సోనావానే అన్నారు. అబ్బనికుంటలోని ప్లాటినం జూబ్లీ హైస్కూల్‌లో రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ (ఐఎస్ఏఆర్‌డీ 2023 - 24) నిర్వహించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల పాఠశాలల నుంచి సుమారు 400మంది విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. పాఠశాల ఆవరణలో సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో శిరీష్ సోనావానే మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేపట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జగదీష్, సెక్షన్ హెడ్ ప్రసన్నలక్ష్మి, ఆఫ్రా, ఫర్వీన్ సుల్తానా, డిపార్ట్‌మెంట్ అధిపతులు మురళీ మనోహర్, ఆర్.అశోక్, విక్టర్ ప్రమోద్, మాధవి, రాజాచంద్రశేఖర్, మార్గరేట్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: ఉత్తర తెలంగాణలో ప్రధానమైన కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్ కేంద్రంగా చేసేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ స్థానిక నాయకులు కోరారు. ఈమేరకు కాజీపేట రైల్వే పెన్షనర్ల సమావేశానికి హాజరైన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని ఆదివారం కలిసి వినతి ప్రతం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాజీపేట ప్రాంతాన్ని ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే అభివృద్ధి చేసిందని తెలిపారు. డివిజన్‌కు కావాల్సిన అన్ని అర్హతలు కాజీపేట జంక్షన్‌కు ఉన్నాయని వివరించారు. కొన్ని రాజకీయ పార్టీలు తమ ప్రయోజనం కోసమే కాజీపేట డివిజన్ అంశాన్ని వాడుకున్నాయని విమర్శించారు. డివిజన్‌కు అర్హత లేకున్నా బిహార్‌లో 25 కిలో మీటర్ల దూరంలో రైల్వే రెండు డివిజన్లు ఉన్నాయని, కేరళలో 20 కిలో మీటర్ల దూరంలో మరో 2 డివిజన్లు, ఆంధ్రాలో విజయవాడకు 33 కి.మీ.దూరంలో గుంటూరును రైల్వే డివిజన్‌గా చేశారని వివరించారు. సికింద్రాబాద్‌కు కాజీపేట సుమారు 140 కిలోమీటర్ల దూరం ఉందని తెలిపారు. అన్ని అర్హతలు ఉన్న కాజీపేటను రైల్వే డివిజన్ కేంద్రంగా చేసేందుకు అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్, చిలకపాటి శివకుమార్, 63వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, నాయకులు ఎండీ.అంకూస్, అరూరి సాంబయ్య, కొండ శివ, ఎండీ.పాషా, క్రాంతి, భరత్, ఇమ్రాన్, సదా, ఆసిఫ్, రోషన్ పాల్గొన్నారు.

వేతనం ఇక్కడ.. విధులు అక్కడ!

కాశీబుగ్గ సెంటర్ : కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని చెబుతున్న పాలకుల మాటలు నీటిమూటలవుతున్నాయి. క్షేత్రస్థాయిలో పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉంది. సరైన వసతులు, సరిపడా సిబ్బంది లేకపోవడంతో పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడుతోంది. జిల్లాల పునర్విభజన తర్వాత వరంగల్ జిల్లాలో పూర్తిస్థాయిలో విద్యాశాఖ అధికారులు లేరు. అదనపు బాధ్యతలతో ఒత్తిడికి గురవుతున్నామని పలువురు మండల విద్యాశాఖ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో జిల్లాలో ఉన్న ఏడీ (అసిస్టెంట్ డైరెక్టర్) సులోచన ఆరు సంవత్సరాలుగా ఇక్కడ వేతనం తీసుకుంటూ హైదరాబాద్‌లోని డెరైక్టర్ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తోంది. ఆమెను రిలీవ్ చేయమని పలుమార్లు జిల్లా విద్యాశాఖ లేఖలు రాసినా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు.

జిల్లాలో మొత్తం 724 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 478 ప్రాథమిక పాఠశాలలు, 86 ప్రాథమికోన్నత పాఠశాలలు, 160 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం ప్రారంభించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలంటే అందుకు తగిన సిబ్బందితోపాటు మౌలిక వసతులు కల్పించాలి. కానీ, అందుకు భిన్నంగా క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. జిల్లాలో ఉన్న ఏడీ సులోచన హైదరాబాద్‌లోని డైరెక్టర్ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తోంది. అధికారులు, సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్నామని, ఏడీని జిల్లాకు రిలీవ్ చేయాలని డీఈఓ లేఖలు రాసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని సమాచారం. ఇప్పటికైనా ఏడీ సులోచనను జిల్లాకు రిలీవ్ చేసి, విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాశిబుగ్గ: ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 21న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న చలో ఢిల్లీ మహాధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు నమిండ్ల చిన్నస్వామి పిలుపునిచ్చారు. ఈమేరకు కాశిబుగ్గ జంక్షన్‌లో చలో ఢిల్లీకి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ ప్రభుత్వం చెప్పి పదేళ్లు కావస్తున్నా ఇంతవరకు వర్గీకరణ చేయలేదని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని కేంద్రాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వద్దూరి కుమారస్వామి, వేల్పుల దయాకర్, జన్ను రాజేష్, నలిగంటి తిరుపతి, మేకల కరుణాకర్ పాల్గొన్నారు.

'లారీ ఓనర్ల' సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఖిలా వరంగల్: ఇసుక లారీ ఓనర్ల పార్కింగ్ అడ్డా సమస్యను పరిష్కరించాలని వరంగల్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి సీహెచ్ శ్రీనివాస్, సభ్యులు కోరారు. ఈమేరకు వర్ధన్నపేట నియోజకవర్గంలో ఆదివారం పర్యటిస్తున్న ఎమ్మెల్యే నాగరాజును లారీ ఓనర్లతో కలిసి ఎమ్మెల్యే నాగరాజును అసోసియేషన్ ప్రతినిధులు కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక లారీ అడ్డా పార్కింగ్ సమస్యలను పరిష్కరించాలని, అక్రమంగా ఇసుక విక్రయాలు జరిపే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు అన్ని రకాల అనుమతులున్నా అధికారులతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇసుక లారీ ఓనర్లు మహేష్, ఓదేలు, శివ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేడియో జర్నలిస్టులకు ఐడీ కార్డుల పంపిణీ



జర్నలిస్టులతో ఏడీ, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు

హన్మకొండ: వరంగల్ రేడియో జర్నలిస్టులకు డీపీఆర్‌ఓ ఏడీ లక్ష్మణ్ చేతుల మీదుగా ఆకాశవాణి సంస్థ గుర్తింపు కార్డులను వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య అందజేశారు. హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో రేడియో జర్నలిస్టు అసోసియేషన్ వరంగల్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిలుగా డీపీఆర్‌ఓ ఏడీ, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఆకాశవాణిలో పనిచేస్తున్న రేడియో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వరంగల్ రేడియో జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు చిరంజీవి, ప్రధాన కార్యదర్శి అర్శం సదానందం, గౌరవ అధ్యక్షుడు జనార్దన్, వ్యాఖ్యాతలు మగ్దూం, డాక్టర్ ఎల్లయ్య, పల్లె నాగేశ్వర్‌రావు, కుమార్, చారి, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, సంధ్యారాణి, వాణి, భాగ్యలక్ష్మి, స్వాతి, మాలతి, మమత, సుమలత పాల్గొన్నారు.

ముగిసిన మడేలయ్య ఉత్సవాలు



ఉత్సవాలకు హాజరైన వినయ్‌భాస్కర్

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన దేవాలయంలో రజక సంఘం సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు మడేలయ్య, సీతాలమ్మ, ఈశ్వరమ్మల విగ్రహాలను ఆదివారం ప్రతిష్ఠించారు. మూడు రోజులుగా సాగుతున్న ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్.. ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన వినయ్‌భాస్కర్‌తో పాటు పండితులను రజక సంఘం నాయకులు సన్మానించారు. బంధు, మిత్రులతో కలిసి మహిళలు డప్పు, వాయిద్యాల మధ్య బోనాలతో ఆలయానికి వెళ్లి దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించారు.

ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



ఎక్సైజ్‌కాలనీలోని వేంకటేశ్వరాలయంలో..



గోదా ఉత్సవమూర్తి విగ్రహం



మడికొండలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో..



కాజీపేటలో..

● తిరుప్పావై ప్రసంగాలు మరూ

హన్మకొండ కల్చరల్: నగరంలోని పలు వైష్ణవ దేవాలయాల్లో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం 5గంటలకు దేవాలయాల్లో వందలాది మహిళలు పాల్గొని గోదా అష్టోత్తర శతనామార్చనలు, పాశురాలు చదువుతూ దీపాలు వెలిగించారు. తిరువారాధనం ఆరగింపు చేశారు. తీర్థ ప్రసాద గోష్ఠి జరిగింది. సామూహిక విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణాలు నిర్వహించారు. సాయంత్రం వైష్ణవ పండితుల ధనుర్మాస పాశుర ప్రసంగాలు జరిగాయి. హనుమకొండలోని అదాలత్ వెనుక ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, ఎక్సైజ్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, రెడ్డి కాలనీలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో, సుబేదారి రెవెన్యూకాలనీలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో, కాజీపేట సిద్ధార్థనగర్ ప్రసన్నాంజనేయ దేవాలయంలో, వరంగల్ బట్టల బజార్‌లోని బాలా వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ధనుర్మాస ప్రసంగాలను ప్రారంభించారు.

మడికొండలోని వేణుగోపాలస్వామి ఆలయంలో..

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలను వైభవంగా ప్రారంభించారు. ఆదివారం ఉదయం అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, రాత్రి 7గంటలకు స్వామివారికి సామూహిక విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, గోవింద నామాలు, శ్రీకృష్ణ అష్టకం, మంత్రపుష్పం, మంగళ శాసనాలు, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మినుగు సతీష్, దువ్వ శ్రీకాంత్, కడార్ల నరేందర్, బజ్జూరి శ్రీనివాస్, రాపర్తి ఉపేంద్రచారి, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాజీపేటలోని శ్వేతార్కలో..

కాజీపేట: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకొని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూల గణపతి దివ్యక్షేత్రంలోని వేంకటేశ్వర స్వామికి మహిళా భక్తులు ఆదివారం రాత్రి పూజలు చేశారు. ఆలయ పూజారి త్రిగుళ్ల శ్రీనివాస్ వర్మ ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చిన భక్తులు.. ఆలువేలు మంగ సమేతుడైన స్వామివారికి మంగళ హారతులు ఇచ్చారు.

క్రీడాకారులకు అభినందనలు



వరంగల్ అర్బన్: క్రీడాకారులను అభినందిస్తున్న డీఎఫ్‌ఓ శంకర్‌లింగం




ఖిలా వరంగల్: క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు

వరంగల్ అర్బన్: ఈనెల 18, 19, 20వ తేదీల్లో మిర్యాలగూడలో జరగనున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్–14 టోర్నమెంట్‌కు డబ్ల్యూఎంసీ బ్యాడ్మింటన్ క్రీడాకారులు శ్రీచేతన్ శౌర్య, మన్యుత్ వాస్తవ్, జస్ప్రీత్.. జిల్లా నుంచి బాలుర విభాగంలో ఎంపికయ్యారు. బాలికల విభాగంలో మనస్విని, ఆదిలాబాద్ నుంచి ఆశిర్య తులసి ఎంపికైంది. ఈమేరకు క్రీడాకారులను డీఎఫ్‌ఓ శంకర్‌లింగం, సూపర్‌వైజర్ రవి, కోచ్ శ్రీధర్ ఆదివారం అభినందించారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఖిలా వరంగల్: ఈనెల 21, 22, 23వ తేదీల్లో నిర్మల్ పట్టణంలో జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఖిలా వరంగల్ మధ్యకోట గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. 17 ఏళ్ల విభాగంలో బీ.అంజని, ఎస్.యశ్వంత్, 14 ఏళ్ల విభాగంలో జీ.శ్రీజ, ఏ.విశాల్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కట్రాజు వెంకటయ్య వివరించారు. ఈమేరకు వారిని సన్మానించారు.

వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు



ధర్మసాగర్ : వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలను ఆ పార్టీ ఘన్‌పూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సంగాల ఇర్మియా ఆధ్వర్యంలో మండలంలోని కరుణాపురంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రార్థనలు చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊరడి శ్రీనివాస్, రాజు, శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ పరీక్షకు స్పందన



హన్మకొండ: రెజోనెన్స్ స్కాలర్‌షిప్ పరీక్షకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. హనుమకొండలో రెజోనెన్స్ కళాశాలల ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ పరీక్షను ఆదివారం నిర్వహించారు. పదవ తరగతి చదువుతున్న 2,100 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరైనట్లు రెజోనెన్స్ విద్యా సంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. ఇలాంటి పరీక్షల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుందని చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇంటర్మీడియేట్‌లో ప్రవేశానికి ఫీజులో రాయితీ అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.